# బండపాటు

జనం మూగేశారు. గొడవ పెద్దదయేటట్టుంది. కొండలచుట్టూ రాళ్ళు కొడుతున్న చప్పుళ్ళు ఆగిపోయాయి. ఎక్కడపని అక్కడ ఆపేసి అంతా గుమిగూడి పోతున్నారు.

శవాన్ని గుడిసెకు చేర్చడమైంది. తరవాత తతంగమంతా తొందర తొందరగా అయిపోతున్నాది.

"నానే సెర్లోపడ్డం దేముడో!" అని పార్వతి ఒకడే ఏడుపు ఏడుస్తున్నాది. చచ్చినవాడి పెళ్ళాం పార్వతి సర్వసన్నద్ధం అయిపోయింది. అప్పుడు దిగిపడ్డాడు నాగన్న. అంతవరకూ కనబడనివాడు అప్పుడు ఊడిపడ్డాడు.

"పనిచేస్తూ సచ్చాడు! పని సేయించినోణ్ణి నిలదీసి అడగొద్దా!" అని ప్రశ్నించాడు నాగన్న. కాస్త నోరున్నవాడు నాగన్న.

"రెడ్డొచ్చాడురా మొదలెట్టండి మళ్ళా" అన్నాడు గుంపులోంచి వొకడు.

"సచ్చినాడు నెగుస్తాడా? బేగి కానీయండి" అన్నాడు మేస్త్రి సత్యం. సైకిలుమీద జారబడి నిలబడి పనంతా చకచకా చేయించేస్తున్నాడు. మేస్త్రి మేసినట్టే ఉంది.

"నామాట యినిపించుకున్నావా?" అని రొకాయించి అడిగాడు కాస్త నోరున్న నాగన్న.

"రామిగాణ్ని కంట్రాక్టరు సంపినాడురా! బండ దొర్లుకొచ్చింది. ఆడి బుర్ర బద్దలైంది. సావు అనాగుంది, సచ్చాడు" అన్నాడు మేస్త్రీ సత్యం.

ముందురోజు సాయంత్రం కొండమీద చాలాచోట్ల బ్లాస్టు చేశారు. బద్దలైన బండలన్నీ కిందికి జార్చేశారు. మర్నాడు పొద్దున్న కొండొద్దున

అప్పుడు పాకలోంచి బైటపడ్డాడో ముసిలాడు. పీకమొయ్యా తాగే శాడు.

"సత్తెం ఈః సావుకి మాబాగా నేసినాడు!" అని చేటంత మొహంతో మెచ్చుకున్నాడు.

"నోరు మూసుకో ముసిలాడా! సచ్చినాడు కు్రాదని యేడుపు కాదు! పీకమొయ్యా పోశారని సంబరం!" అన్నాదో యిల్లాలు.

"నానే సెర్లోపడ్డం బాబో!" అంటూ గుడిసెలో పార్వతి యేడుస్తున్నాది. గుడిసెనిండా గుడిసెచుట్టూ గుమిగూడారు ఆడవాళ్ళు.

మధ్యాహ్నం పన్నెండుకి అంతా చల్లబడిపోయింది. కట్టెని కట్టెలకి అప్పచెప్పి వాళ్ళు కడిగేసుకొన్నారు.

రోజంతా తందనాలాడుతూ పనులు మానుకొన్నారు.

వారం తిరక్కుండా దిగిపడ్డాది చచ్చినవాడి తల్లి చామాలు. చామాలు కొడుకుని చూసి ఐదారేళ్ళయి పోయింది. ఒక్కనాడు కొడుకునీ కోడల్నీ చామాలు సుఖంగా బతకనిచ్చింది కాదు. దాని పోరు పడలేక రామిగాడు పార్వతిని వెంటబెట్టుకుని కొండల మధ్య రాళ్ళు కొట్టుకుంటూ బతికాడు. గుడిసెలు చేరగానే గుండె బాదుకుంటూ చామాలు ఏడుపు మొదలెట్టింది.

"వొచ్చినావాఁ చామాలూ! ఇక్కడ నీ ఏడుపు ఇనే వోళ్ళెవరు?" అన్నాది కనిపెడుతున్న కనకమ్మ.

"కోడలునేదా తల్లే" అని రాగంతో ఏడుస్తున్నాది.

"పనినోకి పోయింది."

"శబాసు! పనినోకి పోయిందా? ఎంత మోరం!" అన్నాది చామాలు.

"దాని కష్టానికున్నారా? సుఖానికున్నారా? ఒక్కత్తి గుడిసెలో ఉంటే పిచ్చెత్తిపోదా? మావేఁ పనిలోకి ఈఃడ్చుకెళ్ళాము. నాల్గు రాళ్ళు వస్తాయి" అన్నాది కనకమ్మ.

"మీరంతా గుడుసోళ్ళమ్మా! మాము సత్తెకాలపోళ్ళం" అన్నది చామాలు. పనిలోంచి తిరిగొచ్చిన పార్వతికి అత్త మొహం కనబడ్డాది.

"నా నేసెర్లో పడ్డం అత్తో" అంటూ ఏడుపు మొదలెట్టింది. వరసలు వరసలు పెట్టి ఏడవడం చాతకాలేదు. ఎప్పుడూ ఒకే ఏడుపు ఏడుస్తున్నాది.

